# అవధూత లీల

## అధ్యాయము - 14

## సాధు దూషణ



కోటితీర్థం దగ్గర పెన్నానదిలో పెద్ద దూలమంత మొద్దు ప్రవాహంలో వచ్చింది. చాలా మంది దానిని బండి మీద తోలుకరావాలని చూచారు. అది చాలా బరువుగా వున్నందున తిరిగి వెళ్ళిపోయారు. ఆ రాత్రి శ్రీస్వామివారు ఒక్కరే దాన్ని భుజాన మోసుకు వచ్చి తమ గుండములో వేశారు. తెల్లవారి దాన్నా రైతులు చూచి, 'ఓ పిచ్చి వెంకయ్యా! బంగారం లాంటి దూలాన్ని ఇట్లా తగులబెడుతున్నావే, నీ కోసమేనా మేము దాన్నక్కడ వుంచింది? అని తూలనాడారు. వారిలో ఒక దుండగుడు, 'నీవీ పిచ్చి పనులు చేయకు' అని చెంపన ఒక దెబ్బ కూడా కొట్టాడట. ఆ దుండగుడు ఇంటికి వెళ్ళేసరికి అతని ఇల్లు తగులపడుతుంది. చుట్టు ప్రక్కల వాళ్లంతా తమను రక్షించమని శ్రీస్వామివారిని ప్రార్థించారు. 'పాపం వున్నంత వరకు పోతుంది మిగిలినది నిలబడుతుంది' అని సెలవిచ్చారు. అట్లాగే ఆ కొట్టినవాని ఇంటివరకూ కాలిపోయింది. మిగిలిన ఇండ్లు చెక్కు చెదరలేదు. తెల్లవారి అతడు శ్రీస్వామివారి కాళ్ళపై బడ్డాడు.

ఒకరోజు శ్రీస్వామివారు ముదిగేడులో ఒకరింటికి వెళ్ళి 'అమ్మా!' అని పిలిచాడు. ఆ గృహిణి దొడ్లో పనిచేసుకుంటూ, 'ఎవరదీ?' అని పెద్దగా అరచింది. శ్రీస్వామివారు 'నేనమ్మా, పిచ్చోణ్ణి' అన్నారు. ఆమెకు సరిగా వినపడక మరలా, 'ఎవరదీ?' అని అరిచింది. శ్రీస్వామివారు తలగీరుకుంటూ 'పిచ్చోణ్ణమ్మా!' అన్నారు. ఆమె 'అయితేనేం?' అన్నది, శ్రీస్వామివారు 'అంత ముద్ద పెడతావనీ!' అన్నారు. ఆ గృహిణి లేదంటూనే ఒక సంగటి ముద్ద శ్రీస్వామివారి తువ్వాలులో వేసింది. శ్రీస్వామివారు 'నాలిక్కడ్డమేమైన అంత వెయ్యమ్మా' అన్నారు అంటే పచ్చడిగాని, కూరగానీ వేయమని భావం. లేదని కసురుకుంటూనే ఆమె అంత పచ్చడి వేసింది. 'అంత ధార వేయమ్మా' అన్నారు శ్రీస్వామివారు. అంటే నెయ్యి వేయమని, ఆమె లేదంటే లేదని

చాలా పరుషంగా మాట్లాడింది. 'ఉట్టిపైన దుత్తలో వుంది, వెయ్యమ్మా' అన్నారు శ్రీస్వామివారు. ఆమె కసిరి కొట్టింది. వెంటనే ఆ ఉట్టి తెగి క్రిందపడి నెయ్యంతా నేలపాలైంది. శ్రీస్వామివారు నవ్వుకుంటూ వెళ్ళిపోయారు. ఇందుకే గాబోలు శ్రీ సాయినాథుడు భిక్షయివ్వకున్నా భిక్షగాళ్ళను తూలనాడవద్దని సెలవిచ్చారు.

అలాగే పెద్దవాళ్ళు, 'కాలు జారినా ఫరవాలేదు. నోరు జారితే ప్రమాదం' అన్నారు. దీన్నే స్వామివారు 'నోరు విప్పకూడదయ్యా' అని చెప్పారు.

